జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 20-2-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 253 పేజీలు: 4 వెల : రూ.7



## నేడు పాలకొండలో..
# మాజీ సీఎం జగన్ పర్యటన

* పాలవలస కుటుంబానికి పరామర్శ
* ప్రత్యేక హెలికాప్టర్‌లో చేరుకోనున్న జగన్మోహన్ రెడ్డి
* ఏర్పాట్లు చేస్తున్న వైసీపీ నేతలు
* పార్టీశ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 19 (వార్త):** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారు. విశాఖ నుంచి హెలిక్యాప్టర్‌లో నేరుగా పాలకొండ చేరుకుంటారు. ఇటీవల మృతి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శించనున్నారు. జగన్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లుకు సంబంధించి ఆపార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం పరిశీలించారు. రాజశేఖరం కుమారుడు పాలవలస విక్రాంత్ ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. ఆయన కుమార్తె రెడ్డి శాంతి పాతపట్నం మాజీ ఎమ్మెల్యే. ఆయన భార్య రేగిడి ఆమదాలవలస జడ్పీటీసీ. ఇలా కుటుంబమంతా వైసీపీలో వివిధ పదవుల్లో ఉన్నారు. రాజశేఖరం మృతి సమాచారం తెలుసుకున్న జగన్మోహనరెడ్డి ఫోన్‌లో పాలవలస విక్రాంత్‌ను, రెడ్డి శాంతిని పరామర్శించారు. రాజశేఖరం మృతికి సంతాపం తెలిపారు. గురువారం నేరుగా పాలకొండలో గల రాజశేఖరం ఇంటికి వెళ్లి ఆయన కుటుంబాన్ని వైఎస్ జగన్ పరామర్శించనున్నారు.

### హెలిపాడ్‌ను పరిశీలించిన ధర్మాన

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గురువారం మధ్యాహ్నం పాలకొండ లో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌తో కలసి ముఖ్య నేతలు పాలకొండలో హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పాతపట్నం, పాలకొండ ,రాజాం మాజీ ఎమ్మెల్యేరెడ్డి శాంతి, విశ్వసరాయి కళావతి, కంబాల జోగులు, కళింగ కోమటి కార్పొరేషన్ మాజీ చైర్మన్ అందవరపు సూరిబాబు, పార్టీ కార్యదర్శి గేదెల పురుషోత్తం ఆయన వెంట ఉన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇతర కార్యక్రమాలుండవని నేరుగా ఆకుటుంబాన్ని పరామర్శించి వెనుదిరుగుతారు. వైసీపీ మండల అధ్యక్షులు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీ, ఇతర ప్రజాప్రతినిధులు, అభిమానులు హాజరుకావాలని కృష్ణదాస్ కోరారు.

### జగన్ టూర్ షెడ్యూల్..

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గురువారం ఉదయం 10.50 గంటలకు తాడేపల్లినుంచి హెలికాప్టర్‌లో బయలు దేరి విశాఖ చేరుకుంటారు. అక్కడ నుంచి పాలకొండకు రెండు గంటలకు వస్తారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఇంటికి చేరుకుని వారి కుటుంబసభ్యులను పరామర్శిస్తారు. తిరిగి వారి ఇంటిని బయలు దేరి 3.25 గంటలకు హెలికాప్టర్‌లో విశాఖ వెళ్లిపోనున్నారు.





# జగన్ పాలన.. విధ్వంసకరం

* ప్రభుత్వ ఆస్తులు తనఖా పెట్టేశారు
* ఒక్క పరిశ్రమ కూడా రాష్ట్రానికి రాలేదు
* కూటమి ప్రభుత్వంలో పేదలకు సంక్షేమ, అభివృద్ధి
* మధ్యతరగతికి ఊరటనిచ్చిన బడ్జెట్
* విశాఖపట్నం నార్త్ ఎమ్మెల్యే పి.విష్ణు కుమార్ రాజు
* కేంద్రబడ్జెట్‌పై మేధావుల సమావేశం

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 19(వార్త):** కేంద్ర బడ్జెట్‌పై మేధావుల సమావేశం అనంతరం బీజేపీ శాసనసభాపక్ష నేత, విశాఖపట్నం నార్త్ ఎమ్మెల్యే పి.విష్ణు కుమార్ రాజు శ్రీకాకుళంలో మీడియాతో బుధవారం మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగించిందన్నారు. రాష్ట్రాన్ని అప్పులపాల్జేసిందని విమర్శించారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రభుత్వ ఆస్తులు తనఖా పెట్టేశారని, ఒక్క పరిశ్రమ కూడా రాష్ట్రానికి రాలేదని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏపీ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఆరులక్షల 30 వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. కూటమి పాలనపై ప్రజలకు విశ్వాసం పెరిగిందన్నారు. పోలీసులపై జగన్‌రెడ్డి విమర్శలు దారుణమని, దీన్ని ఖండిస్తున్నామన్నారు. జగన్ ఇంకా తాను ముఖ్యమంత్రి అనుకుంటున్నట్టు ఉందని, ఆ భ్రమ నుంచి బయటకు రావాలని విష్ణు కుమార్ రాజు హితవు పలికారు.

### మధ్యతరగతికి ఊరటనిచ్చిన బడ్జెట్

కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరటనిచ్చిందని, ఇది జనరంజక బడ్జెట్ అని బీజేపీ శాసనసభాపక్ష నేత, విశాఖపట్నం నార్త్ ఎమ్మెల్యే పి.విష్ణు కుమార్ రాజు అన్నారు. బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు అధ్యక్షతన శ్రీకాకుళం నగరంలోని శ్రీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం కేంద్ర బడ్జెట్‌పై మేధావుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విష్ణు కుమార్ రాజు మాట్లాడుతూ దేవ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ ఉందన్నారు. కేంద్ర మంత్రిగా నిర్మలా సీతారామన్ ఎనిమిదిసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం అరుదైన రికార్డు అని కొనియాడారు. డాక్టర్ బీఆర్ వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గుంట తులసీరావు మాట్లాడుతూ దేశ ప్రజలు కొనుగోలు శక్తి పెరిగే రీతిలో ఈ బడ్జెట్ ఉందన్నారు. వైద్యనిపుణుడు డాక్టర్ కింజరాపు అమ్మన్నాయుడు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన బడ్జెట్‌ను కేంద్రం ప్రవేశపెట్టిందని తెలిపారు. రిటైర్డు జిల్లా జడ్జి పప్పల జగన్నాథరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ పేదలకు మేలు చేసేలా ఉందని తెలిపారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర, రాయలసీమ వెనుకబాటుతనాన్ని గమనించి నిధులు కేటాయించాలన్నారు. చార్టర్డ్ అకౌంటెంట్ ఐకేరావు, కంపెనీ సెక్రటరీ బుర్రా భార్గవ్ మాట్లాడుతూ దేశ ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చుకోవడానికి ఈ బడ్జెట్ దోహదపడుతుందన్నారు. బీజేపీ శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు మాట్లాడుతూ ఇది ప్రజా బడ్జెట్ అని కొనియాడారు. అలాగే పలువురు వక్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. కార్యక్రమంలో విద్యావేత్త నిక్కు అప్పన్న, ఎన్జీవో మణిశర్మ, గురజాడ విద్యాసంస్థల చైర్మన్ సంయుక్త, జామి భీమశంకర్, డాక్టర్ పైడి సింధూర, బీజేపీ నేతలు పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాలం, అట్టాడ రవిబాబ్జీ, బిర్లంగి ఉమామహేశ్వరరావు, చల్లా వెంకటేశ్వరరావు, చింతపల్లి దుర్గారావు గాంధీ, గొలివి కరుణాకరరావు, బూరె నరేంద్ర చక్రవర్తి, మంగి లక్ష్మీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



### విద్యార్థిని అనుమానాస్పద మృతి

**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 19 (వార్త):** మందస మండలం లోహరిబంద ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని కర్రీ అనూష ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మధ్యాహ్నం భోజన సమయంలో ఆమె పాఠ శాలలో కనబడక పోవడంతో తోటి విద్యార్థినులు వెదకడం ప్రారంభించారు. ఈవిషయం ఆమె తల్లి దండ్రులకు ఉపాధ్యాయులు సమాచారం అందజేశారు. వారంతా ఆమె కోసం వెదుకగా గ్రామ సమీపంలోని జీడితోటలో ఊరి వేసుకుని ఉండడాన్ని గమనించారు. పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనాస్థలానికి వచ్చి వివరాలు సేకరిస్తున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి ఇటలీ బాధితుల సమస్య
పల్లె పండుగ పనుల్లో వేగం పెంచండి
హైందవ ధర్మ యోధుడు ఛత్రపతి
లోపలి పేజీల్లో..

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## నేడు పాలకొండకు జగన్మోహన్ రెడ్డి రాక



**వంగర, ఫిబ్రవరి 19(వార్త):** మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ జగన్మోహన్ రెడ్డి నేడు పాలకొండ వస్తున్నట్లు వంగర ఎంపీపీ సురేష్ ముఖర్జీ తెలిపారు. మాజీ జడ్పీ చైర్మన్ పాలవలస రాజశేఖర్ ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఆయన కుటుంబ సభ్యులైన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ను పరామర్శించనున్నట్లు సురేష్ తెలిపారు. దీనికి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ హాజరుకావాలని కోరారు.

# పల్లె పండుగ పనుల్లో వేగం పెంచండి

**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 19(వార్త):** పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరైన పనులన్నింటినీ ఈ నెల చివరి నాటికి పూర్తిచేసి బిల్లులు అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లాలోని ఎంపీడీవోలు, తహసిల్దార్లు, పంచాయతీరాజ్, డ్వామా అధికారులతో మండలాల వారిగా పల్లె పండుగ లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. మండలాలవారీగా మంజూరైన, పూర్తయిన పనులు, బిల్లులు మంజూరు, పెండింగ్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే మంజూరైన రహదారులు, కల్వర్టులు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు నూరు శాతం పూర్తిచేసి బిల్లులు వెంటనే పంపించాలని స్పష్టం చేశారు. ఆర్థిక సంవత్సరం ముగియక ముందే, నిధులు వెనక్కు వెళ్లక ముందే చొరవ తీసుకుని పని చేయించాలని ఆదేశించారు. పంచాయతీ రాజ్ అధికారులకు నిర్దేశించిన వారం వారం పనులు లక్ష్యాలపై వివరాలు అడిగి పనుల ప్రగతిలో పూర్తిగా వెనుకబడిన కొత్తూరు, వజ్రపుకొత్తూరు, టెక్కలి మండలాల అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చేపడుతున్న పనుల సమాచారాన్ని రోజువారి నివేదిక ద్వారా సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణలో ఏమైనా సమస్యలుంటే సంబంధిత అధికారుల దృష్టికి వెంటనే తీసుకురావాలని సూచించారు. సొంత భవనాలు ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు మరుగుదొడ్లు, తాగునీటి వసతుల కల్పన పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిధుల కేటాయింపుతో పాటు పనుల బాధ్యతను ఆర్ డబ్ల్యూఎస్ కు అప్పగించిందని, ఆ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని ఐసిడిఎస్ పీడీని ఆదేశించారు. విధుల్లో అలసత్వం చూపుతున్నారని పాతపట్నం అర్డబ్ల్యూఎస్ ఏఈ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో 60 శాతం పనులు మాత్రమే పూర్తవడం పట్ల ఎస్ఈ నుంచి వివరణ అడిగారు. రూ.50 లక్షలకు పైగా బిల్లులు ఎందుకు అప్లోడ్ చేయలేక పోతున్నారని ఆయనను ప్రశ్నించారు. కొత్తూరులో 18 అంగన్వాడీ కేంద్రాలకి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో జాప్యం జరుగుతుండటం పట్ల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఇంకా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ గురించి, ప్రధాన మంత్రి సూర్య ఘర్, గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ (జీ.ఎస్.డబ్ల్యూ.ఎస్.)-హాజరు, సర్వేల స్థితి, పారిశుద్ధ్యం, రెవెన్యూ సదస్సులు, రీసర్వే గ్రామ సభల విశ్లేషణ, ఐ.వీ.ఆర్.ఎస్. కాల్‌ల విశ్లేషణ, గృహ స్థలాల పునః పరిశీలన, అభ్యంతరం లేని ఆక్రమణల క్రమబద్ధీకరణ వంటి అంశాలను సమీక్షించారు. ఎచ్చెర్ల మండలంలో సచివాలయ ఉద్యోగుల హాజరు 46 శాతం మాత్రమే ఉండటం పట్ల తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇకపై ఏ మండలంలోనైనా సచివాలయ ఉద్యోగుల హాజరు 70 శాతం కంటే తక్కువ ఉంటే ఆయా ఎంపీడీవోల కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా, సీపీవో ప్రసన్నలక్ష్మి, డీపీవో భారతి సౌజన్య, వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాధ స్వామి, డిఎంహెచ్ఓ టీవీ బాలకృష్ణ, ఐసిడిఎస్ పీడి బి.శాంతిశ్రీ తదితరులు హాజరయ్యారు.

### సమీకృత కలెక్టరేట్ పనులు పూర్తి చేయాలి

సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నూతన కలెక్టరేట్ ఆవరణలో జరుగుతున్న పార్కింగ్, సెక్యూరిటీ, ప్రహరీ నిర్మాణం తదితర పనుల వివరాలను బుదవారం ఆయన అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్‌లో అంతర్గతంగా నిర్మిస్తున్న రోడ్డు డివైడర్ పనులను దగ్గరుండి పరిశీలించిన కలెక్టర్, నాణ్యతలో రాజీ లేకుండా నిర్మాణాలు పూర్తి చేయాలని కాంట్రాక్టు ప్రతినిధులకు సూచించారు. సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.



## ఎమ్మెల్యే దృష్టి కి ఇటలీ బాధితుల సమస్య

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 19(వార్త):** రెండు రోజుల క్రితం ఇటలీ కి పంపిస్తామని చెప్పి మోసపోయిన బాధితులు సుమారు 60 మంది జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చి జనసేన పార్టీ ఇంచార్జ్ దాసరి రాజుతో కలవడం జరిగింది. బాధితులు వాళ్ల సమస్యలని దాసరి రాజుకి వివరించారు. సమస్యలను పరిశీలించిన దాసరి రాజు వెంటనే టౌన్ పోలీస్ స్టేషన్ కి బాధితులతో కలిసి వెళ్లి ఎస్ఐ ముకుంద రావుకి కలిసి వాళ్ల సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. అనంతరం ఇచ్ఛాపురం నియోజవర్గం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ బాబు దృష్టికి తీసుకెళ్లారు. దాసరి రాజు ఎమ్మెల్యే తో మాట్లాడుతు సుమారు 350 మంది బాధితుల దగ్గర సుమారు 4 కోట్ల రూపాయలు దోచుకున్నారని చెప్పారు. వాళ్ళ కి తగు న్యాయం చేయాలని ఎమ్మెల్యే తో చెప్పారు. బాధితుల సమస్యల్ని స్పందించి వెంటనే ఎస్పీకి ఫోన్ ద్వారా తెలియజేసి ఈ విషయంపై తగు చర్యలు తీసుకుని బాధితులకు తగునాయ్యం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

## పూర్వ ప్రాథమిక విద్యాభివృద్ధికి కృషిచేయాలి



**వంగర, ఫిబ్రవరి 19(వార్త):** పూర్వ ప్రాథమిక విద్యాభివృద్ధికి అంగన్వాడీ టీచర్లు కృషి చేయాలని వంగర మండల విద్యాశాఖ అధికారి-1 పి.ప్రవీణ్‌కుమార్ సూచించారు. వంగర జడ్పీ హైస్కూల్లో బుధవారం ఏర్పాటుచేసిన జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ విద్యా విధానం (ఎన్ ఈ పి) 2020 ప్రకారం దేశంలోనే పిల్లలందరి కోసం విద్యా వ్యవస్థ దృష్టి, దిశను నిర్దేశించడాని నూతన పాలసీ వచ్చిందన్నారు. పూర్వ ప్రాథమిక విద్యలో బాల్యారంబ సంరక్షణ, విద్య (ఈసీసీఈ) కీలకమైందన్నారు. పిల్లల శారీరక, మానసిక వికాసానికి ఆటపాటలతో కూడిన విద్యను అంగన్వాడి కార్యకర్తలు అందించాలన్నారు. ఈ శిక్షణలో శారీరకాభివృద్ధి, మేధో అభివృద్ధి, సామాజిక భావోద్వేగాభివృద్ధి, భాష అక్షరాస్యత అభివృద్ధి వంటి అంశాల పట్ల బి.శ్రీనివాసరావు, కే.కిషోర్‌కుమార్, ఎం.లక్ష్మీనారాయణ డిఆర్పిలుగా వ్యవహరించి శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ -2. కే.జగదీశ్వరి అంగన్వాడి సూపర్వైజర్లు డి.కళ్యాణి జి.రజని,జి.అమ్మనమ్మలు, అంగన్వాడి టీచర్లు హాజరు కాగా ఈ కార్యక్రమంలో ఎంఐ ఎస్.కిరణ్‌కుమార్,ఎల్.డి.ఏ తవిటినాయుడు, సిఆర్ఎంటిలు వాసు, గణపతి, ప్రేమకుమార్,శ్రీను, అనురాధ, సాంబశివరావు, పారయ్య పాల్గొన్నారు.

## ఆయన నేత్రాలు సజీవం



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 19(వార్త):** శ్రీకాకుళం జిల్లా శ్యామ్ పాలెం గ్రామానికి చెందిన లొడ్డు పాపారావు తన నేత్రాలను దానం చేశారు. మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్ పూతి సుజాత, జి.పవన్ కుమార్ ద్వారా ఆయన కార్నియా సేకరించి విశాఖలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. వారి మృతికి సంతాపం తెలియజేస్తూ దాత కుటుంబ సభ్యులను రెడ్ క్రాస్ ఛైర్మన్ జగన్మోహనరావు, సెక్రటరీ మల్లేశ్వరరావు, ట్రెజరర్ దుర్గా శ్రీనివాస్, ఇతర సభ్యులు అభినందించారు. ప్రస్తుత కాలంలో నేత్రదానం పై అవగాహన, చైతన్యం ప్రజల్లో బాగా పెరుగుతుందని, ఈ విధంగా నేత్రదానం ద్వారా మరొకరికి ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం కలుగుతుందని, అంధత్వ రహిత సమాజ స్థాపనకు యువత,ప్రజలు కృషి చేయాలని అన్నారు.నేత్ర దానం చేయాలనుకునే వాళ్ళు 7842699321కు కాల్ చేయాలని కోరారు.

## డాక్టర్ దేవేందర్ రెడ్డికి ఘన సన్మానం

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 19(వార్త):** స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవేందర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.గత నెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ గారిచే తమ ఉత్తమ సేవలకు అవార్డు లభించింది. ఈసందర్భంగా బుధవారం హాస్పటల్ సిబ్బంది ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ సనపల అనూష, డాక్టర్ శిల్ప, హెడ్ నర్సు, ఐసిటిసి కౌన్సిలర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం




**-జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు**

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 19(వార్త):** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో సూక్ష్మ పరిశీలకులు (మైక్రో అబ్జర్వర్ల) పాత్ర కీలకమని సహాయ ఎన్నికల అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. సూక్ష్మ పరిశీలకులతో బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మొదటి దశ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అనుసరించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర చాలా కీలకమని, వారు ఎన్నికల నియమాలను, నిబంధనలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఏవైనా అనుమానాలు ఉంటే అధికారులను సంప్రదించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియను నిశితంగా పరిశీలించాలన్నారు. శిక్షణలో కలెక్టరేట్ ఏవో సూర్యనారాయణ, సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, పలువురు బ్యాంకు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# నేర నియంత్రణకు కృషి చేయాలి : డీఐజీ




**శ్రీకాకుళం, ఫిబ్రవరి 19(వార్త):** విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి తన కార్యాలయం నుంచి శ్రీకాకుళం,అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా, విజయనగరం, మన్యం పార్వతీపురం జిల్లాల ఎస్పీలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గంజాయి నియంత్రణ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, ఎన్.బి.డబ్ల్యూ అమలు, సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, పోక్సో కేసులు, హేయమైన నేరాలు సంబంధించిన కేసులపై సమీక్ష నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న, గంజాయి సేవిస్తున్న వారిని గుర్తించి వారిపై ప్రత్యేక షీట్స్ తయారు చేయాలన్నారు. గంజాయి ఆస్తుల స్వాధీనానికి, పీ.డీ యాక్ట్ పెట్టేందుకు వివిధ గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న కేసుల పురోగతిని విశ్లేషించి, వాటి పరిష్కారాన్ని వేగవంతం చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హిట్ అండ్ రన్ కేసులలో బాధితులకు పరిహారం అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు సంబంధించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. నేరాల నియంత్రణ, బాధితులకు న్యాయం కల్పించే దిశగా కఠిన చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పోక్సో, మహిళలపై జరిగే నేరాలకు సంబంధించి కేసులను త్వరగా విచారణకు తీసుకువెళ్లాలని, బాధితులకు న్యాయం జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో విశాఖపట్నం రేంజ్ పరిధిలోని 5 జిల్లాల ఎస్పీలు శ్రీ తుహిన్ సిన్హా, వకుల్ జిందాల్, అమిత్ బర్దర్, కె.వి.మహేశ్వర్ రెడ్డి, ఎస్.వి.మాధవరెడ్డి, ఇతర విశాఖపట్నం రేంజ్ అధికారులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## బాధితుడికి పలాస ఎమ్మెల్యే పరామర్శ

**పలాస, ఫిబ్రవరి 19(వార్త):** తెలుగు దేశం పార్టీ సినియర్ కార్యకర్త పిరికర్ల తారకేశ్రరరావు తివ్ర అనారోగ్యంతో బాధపడుతు పలాస ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గౌతు శిరిష అయన ను ఆసుపత్రి లో పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని తెలిపారు. ఆమెతో పాటు పి.విఠల్ రావు, మల్లా శ్రీనివాసురావు, , తమ్మినేని ధనంజేయ, పి.అంజి తదితరులు ఉన్నారు.





## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

**వంగర, ఫిబ్రవరి 19(వార్త):** మండలం మరువాడ గ్రామం లో మండల మహిళా సమాఖ్య సి సి విమల , మరువాడ ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్చార్జి ఆర్నేపల్లి సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో బుధవారం నాడు మహిళా సంఘాల సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ, గ్రామం వివో పరిధిలోని ప్రతి ఎస్ హెచ్ జి సభ్యులు వారి యొక్క పెరట్లలో కిచెన్ గార్డెన్లు (పెరటి తోటలు) వేసుకోవాలి అని సూచించారు. తదుపరి ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్చార్జి సింహాద్రి నాయుడు మాట్లాడుతూ, ఈ కిచెన్ గార్డెన్ లు కు ఎలాంటి పురుగు మందులు ఎరువులు వేయకుండా పండించుకో వొచ్చిన, అలాంటి కూరగాయలు ఆకుకూరలు తినటం వలన షుగర్ ,బి పి ,కేన్సర్ లాంటి రావు అని తెలియజేశారు. మనం తినగా మిగిలిన అన్నం ,కూరగాయ తొక్కలు ,పండ్ల తొక్కలు వంటి వ్యర్థాలు తడివి ఒక తొట్టె లో కానీ ,చిన్న గోతిలో కానీ వేసి దానిలో అప్పుడప్పుడు కొద్దిగా నీరు వేసుకుని హెూమ్ కంపోస్ట్ ఎరువు తయారు చేసుకుని వాటికి ఎరువు గా వాడి పండించాలి అని చెప్పారు.అనంతరం పంచాయతీ సెక్రటరీ బి నాగరాజు మాట్లాడారు, ఈ కార్యక్రమం లో డిజిటల్ అసిస్టెంట్ సంతోష్ , ఫీల్డ్ అసిస్టెంట్ , జి నరసింగ రావు , వివో ఏ తవిటయ్య , ఐ సి ఆర్ పి పోలినాయుడు , వివో బీ లు సింగిరెడ్డి సావిత్రి, పిల్లి రాధ, కే అప్పమ్మ, సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాన్ని వేరే చోటుకు మార్చండి



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 19(వార్త):** సురింగి రాజా వారి మైదానం వైపు వెళ్లే మార్గంలో బేల్లుపడా కొటేరు బంద రోడ్డు లో గల కరెంటు పోల్ కాస్త ముందుకు మార్చాలని సీడప్ మాజీ చైర్మన్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి కోరారు.నిత్యం బస్సు లు, వాహనాలు రద్దీ ఎక్కువగా ఉన్న ఈ మార్గంలోని మలుపులో కరెంటు స్థంబాన్ని వాహనాలు డీకొట్టే అవకాశం ఉందని అన్నారు.పొరపాటున బస్సు కరెంటు వైర్ గల స్థంబాన్ని డీకొడితే జరిగే ప్రమాదస్థాయి ఊహించలేమని చెప్పారు.విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేసి నట్లు చెప్పారు.

## మున్సిపల్ టౌన్ ప్లానింగ్ డైరీ ఆవిష్కరణ



**పలాస, ఫిబ్రవరి 19(వార్త):** పలాస కాశీబుగ్గ పురపాలక సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు చేతుల మీదుగా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ డైరీని బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి వరభూషణరావు, టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగుల సమస్యల సాధనకు సహకరిస్తా

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 19(వార్త):** శ్రీకాకుళంలో దివ్యాంగుల ఉద్యోగ సంఘం క్యాలెండర్‌ను వయోవృద్ధులు బీదివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు (ఎ.డి) కె.కవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎ.డి. కె.కవిత మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధికి సమస్యల పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సక్షం జిల్లా కన్వీనర్ డా.ఎం.కె.మిశ్రో, జిల్లా సెక్రటరీ సిహెచ్.గణపతి పాల్గొన్నారు.




## ప్రమాదాలు నివారించడమే ధ్యేయం

- లైసెన్స్ లేకపోతే కఠిన చర్యలు తప్పవు
- ఎస్పీ ఆదేశాల మేరకు పటిష్ట చర్యలు
- ట్రాఫిక్ ఎస్.ఐ ఎస్.సోమశేఖర్

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 19(వార్త):** రోడ్డు ప్రమాదాలు నివారించటమే ధ్యేయంగా ట్రాఫిక్ నిబంధనలు పటిష్టం చేశామని, జిల్లా ఎస్పీ మహేశ్వర రెడ్డి ఆదేశాలమేరకు నిరంతరం రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నామని, లైసెన్సు లేకపోయినా, మద్యపానం సేవించి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే ట్రిపుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడిపి పట్టుబడితే తగిన మూల్యం చెల్లించుకోవాలని, మైనర్లు పట్టుబడితే తల్లితండ్రులకు, మైనర్లకు కౌన్సిలింగ్ చేసి బాధ్యతాయుతంగా ఉండేలా అవగాహన కల్పిస్తామన్నారు. వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నిదానమే ప్రధానమని సూక్తిని ప్రతీ ఒక్కరూ పాటిస్తే భారీ ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఈ రోజు విధి నిర్వహణలో భాగముగా స్థానిక ఏడు రోడ్ల కూడలి వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించామని, టూ వీలర్స్, ఆటో, ఫోర్ వీలర్స్ వాహనచోదకులకు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ సోమేశ్వరరావు, ట్రాఫిక్ కానిస్టేబుల్ సింహాచలం, ఈశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.




## రాష్ట్ర పోటీలకు పలాస క్రీడాకారులు



**పలాస, ఫిబ్రవరి 19(వార్త):** ఈనెల 21 ఫిబ్రవరి 25 నుండి 22 ఫిబ్రవరి 25 వరకు తూర్పుగోదావరి జిల్లా ,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిట్యాల లో జరుగు 48వ అంతర జిల్లాల స్త్రీ, పురుషుల టెన్నికాయిట్ జట్లు ఎంపికై పోటీల్లో ఎంపికయ్యారు. పోటీల్లో పాల్గొనడం కోసం క్రీడాకారులకు నర్తు వెంకటరమణ క్రీడా దుస్తులు బహుకరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మల్లా సంతోష్ కుమార్, సుడియా వెంకట జోగారావు కోశాధికారి పి .తవిటయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు బి.శంకరరావు,ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు. పురుషుల జట్లు సిహెచ్. తారకేశ్వరరావు, కె. గోవిందరావు, పి. జగదీష్ బెహారా ,ఎం. మణికంఠ మహిళల జట్లు ఎస్. దివ్య,డి.రమ్య, పి. కావ్య శ్రీ ,టి.భావన వీరికి కోచ్, మేనేజర్లుగా ఎం. దామోదర్, ఎల్ .దిలీప్ కుమార్, బి. మహేష్ వ్యవహరిస్తారని అధ్యక్ష కార్యదర్శులు తెలియజేశారు.

## పారదర్శకంగా కాశీబుగ్గలో రిజిస్ట్రేషన్ సేవలు

**పలాస, ఫిబ్రవరి 19(వార్త):** ఎలాంటి మధ్యవర్తి లేకుండా పని చేసుకోవచ్చని సబ్ రిజిస్టర్ కార్యాలయం సబ్ రిజిస్టర్ పి శ్యామల ఒక ప్రకటనలో తెలిపారు. ఒక దస్తావేజును ఏ వ్యక్తి అయిన రిజిస్ట్రేషన్ .ఏపీ .గవర్నమెంట్ .ఇన్ వెబ్ సైట్ నందు ఉన్న ప్రైమ్ డాటా ఎంట్రీ %డ% డాక్యుమెంట్ జనరేషన్ ద్వారా స్వయముగా వారి వారి దస్తావేజులను తయారు చేసుకోవచ్చును, ఎన్ కంబరెన్స్ (ఈ.సి), నకలు (సి.సి), మార్కెట్ విలువ సర్టిఫికెట్ (ఎం.వి), స్టాంపు లను కూడా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా స్వయముగా దరఖాస్తు చేసుకోవచ్చునుని, రిజిస్ట్రేషన్ .ఏపీ .గవర్నమెంట్ .ఇన్ వెబ్ సైట్ నందు ఉన్న హిందూ వివాహముల రిజిస్ట్రేషన్ మరియు స్పెషల్ వివాహముల రిజిస్ట్రేషన్ ల ద్వారా వివాహ రిజిస్ట్రేషన్ కొరకు స్వయంగా ప్రజలు దరఖాస్తు చేసుకుని సదరు సేవలను నేరుగా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పొందవచ్చును, మరియు ప్రతి సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయం



నందు ప్రజల కొరకు హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసియున్నామని, కావున, రిజిస్ట్రేషన్ కు మరియు ఇతర సేవల కొరకు వచ్చే ప్రజలు దస్తావేజు లేఖరులు లేదా మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా సబ్ రిజిస్ట్రార్ ను గానీ హెల్ప్ డెస్క్ నందు వారికి సేవలను పొందగలరుని ఆమె పేర్కొన్నారు. ఎలాంటి అపోహలకు ఆస్కారం లేదని,పారదర్శకంగా పనిచేస్తున్నామని తెలిపారు.

## ఆధ్యాత్మిక సాంప్రదాయాలకు పుట్టినిల్లు

- మహా కుంభమేళాతో ప్రపంచానికి భారతదేశ సంస్కృతి ప్రచారం
- విజయనగరం ఎంపీ అప్పలనాయుడు
- ప్రయాగ్ రాజ్‌లో ఎంపీ కలిశెట్టి దంపతుల పుణ్యస్నానాలు

**రణస్థలం, ఫిబ్రవరి19(వార్త):** ప్రయాగ్ రాజ్ మహా కుంభమేళాలో విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు దంపతులు కుటుంబ సమేతంగా పుణ్యస్నానాలా చరించారు. త్రివేణి సంగమం షాహి స్నానఘట్టంలో సాంప్రదాయబద్ధంగా స్నానం ఆచరించి గంగాదేవికి పూజలు చేసి, హారతు లిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహా కుంభమేళా ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాదని.. ఇది భారతదేశ సాంస్కృ తిక, ఆధ్యాత్మిక వారసత్వం. నమ్మకం, ఆచారాలు, ఆధ్యాత్మిక జ్ఞానంతో ముడిపడి ఉన్న శక్తిమంతమైన వేడుకని అభిప్రాయపడ్డారు. మానవత్వం, ఆధ్యాత్మికత మధ్య సంబంధాన్ని, లోతుగా నాటుకుపోయిన భారతజాతి విలువలను ప్రతిబింబిస్తుందన్నారు. పవిత్ర నదుల్లో ఆచరించే స్నానం, దానం, హృదయపూర్వకమైన భక్తి మోక్ష మార్గాన్ని చూపిస్తాయని కోట్లాదిమంది నమ్మకమే ఈ కుంభమేళాకు వస్తున్న జనసంద్రం అని పేర్కొన్నారు. భారతదేశం సాంస్కృతిక, ఆధ్యాత్మిక సాంప్రదాయాలకు పుట్టినిల్లని మరో సారి రుజువైందన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## కొత్త బోర్లకు నూతన మార్గదర్శకాలు

**పలాస, ఫిబ్రవరి 19(వార్త):** భూగర్భ జలాలు పలాస కాశీబుగ్గ పురపాలక సంబఘం పరిధిలో తగ్గుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వారు బోరుబావి తవ్వకాలకు జారీ చేసిన మార్గదర్శకాలను మున్సిపల్ కమిషనర్ నడిపేనా రామారావు తెలిపారు. భూగర్భజల సర్వే నిమిత్తము ఇంటి యజమాని మున్సిపల్ కార్యాలయానికి సంప్రదించి చలానా చెల్లించవలెనుని, ఈ చలానాతో పాటుగా ఫారం-2 లో కొత్త బావి తవ్వడం కొరకు దరఖాస్తు ను కూడా సమర్పించవలసి ఉంటుందిని తెలిపారు. ఈ దరఖాస్తు తో పాటు కొత్తగా తవ్వబోయే బోరు బావికి, సమీప దూరంలో గల బోరు బావుల వివరములను తెలిపే ఫీల్డ్ స్కెచ్, ప్రతిపాదిత స్థలములో బోరుబావి నిర్మాణము ఇంతకుముందు జరిగి ఉండలేదన్న సర్టిఫికెట్ గత పరచాలని చెప్పారు. ఈ దరఖాస్తు పై స్థానిక మున్సిపల్ కమిషనర్ కౌంటర్ సైను తప్పనిసరిగా ఉండవలెనుని వెల్లడించారు. బోరుబావి తవ్వే రిగ్గు తప్పనిసరిగా జిల్లా భూగర్భ జలవనరులు శాఖలో రిజిస్టర్ అయి ఉండవలెనుని, అట్లు రిజిస్టర్ కాని రిగ్గు ద్వారా ఎవరైనా యజమాని బోరు బావి తవ్వడానికి ప్రయత్నించినచో, సదరు రిగ్గును సీజ్ చేయబడునుని హెచ్చరించారు. ఆ ఇంటి యజమానికి ఒక లక్ష రూపాయల వరకు జరిమానా విధించబడునని తెలియజేశారు. అనుమతి వచ్చిన తరువాత, మున్సిపల్ అధికారుల సమక్షంలో బోరుబావి తవ్వబడునని పత్రికా ప్రకటనలో తెలియజేశారు

# హైందవ ధర్మ యోధుడు ఛత్రపతి శివాజీ



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 19(వార్త):** హైందవ ధర్మ పరిరక్షకుడుగా చత్రపతి శివాజీ ప్రతి భారతీయుడు గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని వక్తలు పేర్కొన్నారు. నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర సమరయోధులు సంఘసంస్కర్తల స్మృతి వనంలో చత్రపతి శివాజీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులు వావిలపల్లి జగన్నాథం నాయుడు, బిజెపి జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు, పైడి హరి నాథరావు, నిస్థల నరసింహమూర్తి, వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, పైడి వేణుగోపాలం, బిర్లంగి ఉమా మహేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ భారత దేశంలో ప్రతి ఒక్కరూ చత్రపతి శివాజీ స్ఫూర్తితో జీవనం సాగించాలన్నారు. దేశం కోసం ధర్మం కోసం పోరాడిన యోధుడిగా శివాజీ చరిత్రలో నిలిచిపోయారన్నారు. తన జీవనపర్యంతం భారతీయుల కోసం పోరాడిన శివాజీ అమ్మవారి సాక్షాత్కారం పొందిన ధన్యజీవిగా నిలిచిపోయారన్నారు. నాటి పాలకుల దురాగతాలను ఎదిరించి, వెన్ను చూపని వీరుడు చత్రపతి శివాజీ అని కొనియాడారు. ప్రపంచానికి హిందూ ధర్మం విశిష్టతను చాటి చెప్పిన శివాజీ స్ఫూర్తి సజీవమన్నారు. తొలత శివాజీ విగ్రహానికి బిజెపి నాయకులు గాంధీ మందిర్ కమిటీ ప్రతినిధులు వాకర్స్ ప్రతినిధులు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో పలు రంగాల ప్రముఖులు జామి భీమ శంకర్, వాకర్స్ ఇంటర్నేషనల్ కొంక్యాన వేణుగోపాల్, వాకర్స్ మాజీ గవర్నర్ గేదల ఇందిరాప్రసాద్, పందిరి అప్పారావు, గేదెల లక్మి, సుప్రియ, బుడుమూరు సూర్యారావు, నక్క శంకర్రావు, బొడ్డేపల్లి ప్రసాదరావు, గుత్తుచిన్నారావు, తర్లడ అప్పలనాయుడు పద్మావతి, విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

### శాంతినికేతన్ స్కూల్ లో ..

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 19(వార్త):** శాంతినికేతన్ స్కూల్ చైర్మన్ డి. కృష్ణ మూర్తి రెడ్డి ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ స్వరాజ్యం కోసం పోరాడి ప్రాణాలు సైతం అర్పించిన గొప్ప యోధుడు ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. ఎంతో మందికి స్ఫూర్తిదాయకమైన వ్యక్తి అన్నారు. ధర్మస్థాపనకై ఆయన చేసిన పోరాటం ఎంతో మందికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో మేనేజర్ కే.సి. పూరి ఉపాధ్యాయులు పద్మజ, శాంతి, సునీత ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ వైస్ ప్రెసిడెంట్ జిహారిక, జాయింట్ సెక్రటరీ డి. హర్షవర్ధన్ రెడ్డి, ఎస్ పి ఎల్ జోత్స్నా పాల్గొన్నారు.



## జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి



**పలాస, ఫిబ్రవరి 19(వార్త):** జీడి పంటకు సరియైన గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని ప్రధానమైన డిమాండ్, నాలుగు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న రైతాంగం రైతాంగ సమస్యల సాధన కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర పౌర విమానా శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును వినతి పత్రం అందజేశారు. ఈ ప్రాంత రైతుల చిరకాల వాంఛ అయినటువంటి వంశధార కాలువ పలాస మండలం యాపోడు చెరువుకు అనుసంధానం చేస్తూ ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని కోరారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందిస్తూ రైతుగానికి హామీ ఇచ్చారు, వినతి పత్రము అందజేసిన వారిలో గొర్లి చలపతి, మద్దెల ధర్మారావు, తామాడ త్రీలోచనరావు, బొడ్డు సింహాద్రి, బత్తిన వాసు, తామాడ రామారావు, తెలుగు యువత అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, గురుదాసుపురం సర్పంచ్ కుత్తుము లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## పథకాల కోసం దరఖాస్తులందించండి

### -ఎమ్మెల్యే రవికుమార్



**ఆమదాలవలస, ఫిబ్రవరి 19(వార్త):** అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం వివిధ పథకాలు అందజేసేందుకు సంకల్పించిందని ఎమ్మెల్యే కూన రవికుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో గల అర్హత ఉన్న లబ్ధిదారులు పథకాల కోసం దరఖాస్తులను నేరుగా తనకు గాని, ఆమదాలవలస పట్టణంలో ఉన్న తన కార్యాలయంలో కానీ దరఖాస్తులు అందచేయవచ్చని ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు కార్యాలయంలో దరఖాస్తులు అందించవచ్చు అన్నారు. నియోజకవర్గం లో అర్హులైన లబ్దిదారులు వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లు కావలసినవారు, ఇంటి స్థలాలు కావలసినవారు,ఇల్లు కట్టు కోదలచిన వారు, కొత్త రేషన్ కార్డులు కావలసినవారు ధరఖాస్తులను అంద చేయవచ్చని ఎమ్మెల్యే రవికుమార్ ప్రకటనలో తెలిపారు.

## వంగర, సంగాంల్లో పొలం పిలుస్తోంది




**వంగర, ఫిబ్రవరి 19(వార్త):** మండలంలోని వంగర, సంగం గ్రామాల్లో వ్యవసాయ అధికారి టి కన్నబాబు రైతులతో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం రైతులకు వివిధ రకాలైన పంటలు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంటలు అధిక దిగుబడి సాధించాలంటే ఎలాంటి మెలుకువలు చేపట్టాలన్న వాటిపై క్షుణ్ణంగా వివరించారు. మొక్కజొన్న, చెరకు తదితర రకాలైనటువంటి పంటల పట్ల రైతులను తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# మండల సిబ్బంది పనితీరుపై డిప్యూటీ సీఈఓ విచారణ

### -మంత్రి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 19(వార్త):** సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయం (ఎంపీడీఓ)సిబ్బంది పనితీరు పై డిప్యూటీ సీఈఓ సత్యన్నారాయణ బుధవారం విచారణ జరిపారు. ఈ కార్యాలయంలో పనిచేస్తున్న ఎంపీడీఓతో సహా మిగతా సిబ్బంది, స్థానికంగా నివాసం ఉండక, సమయపాలన పాటించడం లేదని పలు దినపత్రికలు మంగళవారం వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. దీనిపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించి జిల్లా అధికారులకు విచారణ చేయండని ఆదేశించారు. ఈ మేరకు సీఈఓ శ్రీధర్ రాజా ఆదేశాలు మేరకు డెప్యూటీ సీఈఓ సత్యన్నారాయణ ఉదయం ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకొని విచారణ జరిపారు. ముందుగా కార్యాలయం రికార్డులు పరిశీలించగా ఫిబ్రవరి నెలలో అటెండెన్సీ రిజిస్టర్ లో ఒక్క సంతకం చేయని ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ విచారణ అధికారి చేసే సరికి బుధవారం వరకు సంతకాలు చేసి ఉండడం విశేషం. సిబ్బంది ఎవరెవరు ఎక్కడ నుంచి వస్తున్నారని ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, ఈఓపిఆర్డీ పద్మజ, ఏ ఓ కుమార్ పట్నాయక్, సీనియర్ అసిస్టెంట్ నర్సింగరావు వివరాలు అడిగి స్టేట్మెంట్స్ రికార్డు చేశారు. స్థానికంగా ఉండక పోతే హౌస్ రెంట్ ఎలివేన్స్ ఎలా క్లైమ్ చేస్తున్నారని వారిని ప్రశ్నించారు. ఇకపై ప్రతి ఒక్కరూ హెడ్ క్వార్టర్ లో నివాసం ఉండాలని, సమయపాలన పాటిస్తూ సక్రమంగా విధులు నిర్వహించాలని లేకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ తో సహా అందరిని



హెచ్చరించారు. దీంతో మండల కేంద్రంలో నివాసం ఉంటామని ఎంపీడీఓ అంగీకరించారు. పంచాయతీ కార్యదర్శులు ఎస్సార్ నమోదు లో అలసత్వం వహించిన సీనియర్ అసిస్టెంట్ ను ఆయన తీవ్రంగా మందలించారు. సమయపాలన, రికార్డుల నిర్వహణ, అటెండెన్స్ రిజిస్టర్ లో సంతకాలు తదితర లోపాలు పై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తానని దీనిపై తదుపరి చర్యలు తీసుకుంటారన్నారని ఆయన అన్నారు. ఇకపై ఇలాంటివి పునవృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఢిల్లీరావు మరణంపై వీడని మిస్టరీ

### -సహజమా..అసహజమా అని పోలీసులు తేల్చకపోవడంపై అనుమానాలు?

### -40 రోజులు దాటినా నిజాల వెల్లడిలో జాప్యమెమెందుకో?

### -కుట్రకోణం ఉందంటున్న ప్రజాసంఘాలు

పలాస, ఫిబ్రవరి 19, (వార్త): ప్రశాంత ఉద్దానంలో జిల్లా పౌరహక్కుల సంఘము సభ్యులు తెప్పల ఢిల్లీ రావు మృతి జరిగి45 రోజులు గడచినా ఇంకా ఆ గటనకు నిజాలు నిగ్గు తేల్చేదుకు వీలుగా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవడము లో ఆలస్య ము జరుగుతుందన్న విమర్శలు ఉన్నాయి. ఆయన మరణం ఓ మిస్టర్ గా మారింది అనే చేర్చ ఇక్కడ జరుగుతుంది. పదే పదే ప్రజాసంఘాలు ఢిల్లీ రావు ది అత్యా కాదా అనే నిగ్గు వివరాలు చెప్పండి అని వారు అడుగుతున్నారు. అయినా ఆ సమస్యకు పరిష్కారం కాలేదు. విషయం పై నిజాలపై చెప్పాలని కోరుతూ నెలలు గడుస్తున్నా, ఢిల్లీరావు మృతిపై వెలుగు చూడని నిజాలపై కాశీబుగ్గ డీఎస్పీకి ప్రజాప్రతినిధులు కలిసి వినతి పత్రం ఇచ్చారు.పలాస మండలం, చిన్ననీలావతి గ్రామానికి చెందిన పౌరహక్కుల సంఘం సభ్యుడు తెప్పల డిల్లీరావు గత నెల 20వ తేదీన అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన విషయం విధితమే. అయితే, దాదాపు నెలరోజులు గడుస్తున్నా ఈ ఘటనపై పోలీసుల నుంచి ఎటువంటి స్పష్టమైన స్పందన రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందని స్థానిక ప్రజలు భావిస్తున్నారుఈ నేపథ్యంలో, తక్షణమే దోషులను గుర్తించి, అరెస్ట్ చేయాలని నీలావతి, బొడ్డపాడు, మాకన్నపల్లి, గురుదాసుపురం, మామిడిమెట్టు పంచాయితీల ప్రజా ప్రతినిధులు, నాయకులు, స్థానిక ప్రజలు, కుటుంబ సభ్యులు బుధవారం కాశీబుగ్గ డీఎస్పీ వెంకటఅప్పారావును కలిసి వినతిపత్రం సమర్పించారు.

మృతుడి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, డిల్లీరావు మృతి వెనుక అనేక రహస్యాలు ఉన్నాయనే అనుమానం ఉందని, విచారణను వేగవంతం చేసి, న్యాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై కాశీబుగ్గ వెంకట్ అప్పారావు మాట్లాడుతూ, ఈ కేసును ప్రత్యేక దృష్టితో విచారిస్తున్నామని, త్వరలోనే సత్యాన్ని వెలుగులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అన్ని కోణాల్లోనూ విచారణ జరుపుతున్నామని, దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షిస్తామని ఆయన అన్నారు. డీఎస్పీని కలిసిన వారిలో నేల ఉత్ సర్పంచ్ సొర్ర తిరుపతిరావు, బొడ్డపాడు సర్పంచ్ తామాడ మదన్,మాకన్నా పల్లి ఎంపీటీసీ కోరాడ ధనరాజ్, మామిడి మెట్టు సర్పంచ్ సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ బత్తిన హేమేశ్వరరావు.మాజీ సర్పంచ్ పుచ్చ భాస్కర్ రావు లు ప్రజా సంఘాలు పాల్లోన్నాయి.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546